(MIJ) 2015, Vol No 1, Jan-Dec **e-ISSN: 2454-924X; p-ISSN: 2454-8103**

# మహిళ చైతన్యం – అక్షరాస్యత
# WOMEN'S CONSCIOUSNESS – LITERACY

***జి. సుకన్య, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ సిటి కళాశాల, హైదరాబాద్***

**G.Sukanya**

*Lecturer in Telugu, Government City College, Hyderabad*

## ABSTRACT

*Nowadays, women have started working alongside men in all fields to achieve financial independence, making efforts to live without depending on anyone. When a woman is educated, the family prospers. When families prosper, villages improve. When villages improve, the nation develops. Only when the nation develops can the world progress, leading to the growth of humanity. Recognizing this, the government initiated measures such as administrative mechanisms and self-help savings groups, planting the seeds for women empowerment. However, female literacy is not entirely promising. Many children remain illiterate, and with population growth, their numbers continue to rise every year. In Kashmir, the literacy rate is at 90%.*

## పరిచయం :

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా?" ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు కొలువై వుంటారు. అంటే దేవతలు కొలువై ఉన్నచోట సఖల భోగభాగ్యాలు, సిరిసంపదలూ విలసిల్లుతూ, ప్రజలందరూ క్షేమ, శాంతి, సౌభాగ్యలతో జీవిస్తారని అర్థం.

భారతదేశం కర్మభూమి, వేదభూమి, పుణ్యభూమి, ఇటువంటి పవిత్రభూమిలో అనాదిగా స్త్రీ మూర్తికి అత్యంత గౌరవం ప్రాధాన్యం ఇవ్వబడింది. భారతీయ పురాణ వాఙ్మయంలో మనకు కన్పించే అనసూయ, మైత్రేయి, గార్గి, లోపాముద్ర, ఇంద్రాణి, ధారిణి మొదలైన పాత్రలు ఒక గురువుగా, మేధావిగా తల్లిగా, సహోదరిగా స్త్రీమూర్తి యొక్క ఔన్నత్యాన్ని చాటుతున్నాయి. ఒక సత్యభామ యుద్ధ పాటవాన్ని ప్రదర్శిస్తే, సీతను అచంచలమైన ధైర్యానికి ప్రత్యేకంగా చెప్పవ చ్చును. అనసూయ, అరుంధతి వంటి సాధ్వీమణులు, రాణి రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి, పల్నాటి నాగమ్మ లాంటివీర వనితలను కన్న దేశం మనది. ఆ విధంగానే సరోజినీనాయుడు, విజయలక్ష్మిపండిత్, దుర్గాబాయ్ దేశముఖ్ లాంటి ఎందరో ఆణిముత్యాలు పురుషాధిక్యత ఉన్న సమాజంలో ఒక స్థానం సంపాదించు కొని మహిళలందరికి ఆదర్శంగా నిలిచారు. వీరందరు వీర వనితలు. ఇంతటి ప్రాచీన చరిత్ర కలిగినా నిరక్షరాస్యతలో స్వీయచైతన్యం లేక ఆత్మవిశ్వాసం లేక చుట్టూ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న విషయాలపైన అవగాహన లేకపోవడంవల్ల పురుషాధిక్య సమాజంలో మహిళల ఆలోచనలను ఎదగ నీయలేదు.

**మహిళా చైతన్యం –అక్షరాస్యత :**

ఈనాడు ఆర్థిక పరిపుష్టికోసం అన్ని రంగాలలో పురుషుడితో సమానంగా స్త్రీలు పనిచేయడం మొదలు పెట్టిన, స్త్రీలు ఎవరిమీద ఆధారపడకుండా ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారు. స్త్రీ అక్షరాస్యతను కలిగి ఉన్నట్లయితే కుటుంబం బాగుపడుతుంది. కుటుంబం బాగుపడితేనే గ్రామాలు బాగుపడతాయి. గ్రామాలు బాగుపడితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశం అభి వృద్ధి చెందితేనే ప్రపంచం అభివృద్ధి చెంది మానవ వికాసం కలుగుతుంది. ఈవిషయాన్ని గమనించిన ప్రభుత్వం అధికార యంత్రాంగం, స్వయంసహాయక పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి మహిళ సాధికారతకు బీజాలు నాటింది. మహిళా అక్షరాస్యత అనేది అంతా ఆశాజనకంగా లేదు. ఎంతమంది మన బాలబాలికలు నిరక్షరాస్యు లుగానే ఉన్నారు. జనాభా పెరుగుదలతో ప్రతిసంవత్సరం వారి సంఖ్య పెరుగుతూ వుంది. కాశ్మీరులో అక్షరాస్యత 90 % ఉంది.

స్త్రీ పురుషులు విద్యావంతులైతే దాని ఫలితంగా జనాభా పెరుగుదల తగ్గించండం లాంటి మరెన్నో మంచి పనులు జరుగుతాయి. జనాభా పెరుగుతుంటే దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేయజాలము. తమ కుటుంబంలో ఎక్కువ పిల్లలుంటే వారిని సరిగా పోషించలేమని చదువు కున్న మహిళ తెలుసుకోగల్గుతుంది. కాబట్టి ప్రపంచ వ్యాప్తంగా అధిక జనాభాను విద్యాబోధన ద్వారా నియంత్రించడం జరుగుతోంది. కేరళలో సంపూర్ణ అక్షరాస్యతతో జనాభా పెరుగుదల శాతం సున్నాకు చేరుకుంది. ఇది భారతదేశం అంతా వ్యాపించాలి. ఈ విధంగా స్త్రీ పురుషులను పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. మన భారతీయ మహిళలు క్రింది స్థాయి పనులతో పాటు పై స్థాయి ఉద్యోగాలను కూడా ఎంతో భాద్యతాయుతంగా నిర్వహిస్తారు. కాని సాంఘిక అభద్రతవలన మహిళలు దీనస్థితిలో ఉన్నారు. ఎక్కడైనా సాంఘిక అభద్రత ఏర్పడితే మహిళల స్వతంత్ర్యం హరింపబడుతుంది. సంఘంలో నేరం పెరిగితే మహిళా స్వతంత్ర్యం ప్రమాదంలో పడుతుంది. ఢిల్లీ, శ్రీనగర్, అమెరిక మొదలైన దేశాలలో హింస అనేది నిత్యం మనకు కన్పిస్తుంది.

పటిష్టమైన, అభివృద్ధికరమైన భారతదేశాన్ని నిర్మించడానికి మనమందరం పూనుకొని మానవతా ధృక్పధాన్ని అవలంభించాలి. మతం, రాజకీయాలు, మన సాంఘిక వ్యవస్థ అన్ని కూడా ఆ దిశగా మనకు తోడ్పడినప్పుడు లక్షలకొలది వెనుకబడిన ప్రజలను విద్య, ఆర్థిక స్వావలంభనతో వారి సామాజిక స్థాయిని పెంపొందించగల శక్తి వస్తుంది. ఈశక్తిని పెంపొందిచు కోవడమే మన విద్యా విధానం ముందున్న అతిపెద్ద సమస్య. మన యువత పౌరసత్వ భాద్యతను తెలుసుకున్నప్పుడే విద్య అనే పదానికి అర్థం తెలుస్తుంది. అలా జరగపోతే విద్య కేవలం ఉద్యోగాన్ని కల్పించి జీవనోపాధికి మాత్రమే ఉపయోగపడుతుంది. భారతదేశంలో అక్షరాస్యత రేటులో విస్తృత స్థాయిలో లింగపరమైన అసమానత ఉంది: వయోజనుల (15 కంటే ఎక్కువ వయస్సుగలవారు) అక్షరాస్యత రేటు 2009లో పురుషుల్లో 76.9

శాతం ఉండగా, మహిళల్లో ఇది 54.5 శాతం వద్దే ఉంది. తక్కువ మహిళల అక్షరాస్యత రేటు భారతదేశంలో కుటుంబ నియంత్రణ మరియు జనాభా స్థిరీకరణ చర్యలపై నాటకీయంగా ప్రతికూల ప్రభావం చూపుతుంది.

విద్య అనేది కేవలం జీవనభృతికి మాత్రమే కాకుండా సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చే విధంగా ఉండాలి. అప్పుడే విద్యావంతులు మానవతా భావంతో సంఘంలో ఆరోగ్యకర మార్పుల్ని తీసుకొస్తారు. ఒక దేశ అభివృద్ధికి అభ్యుదయానికి జరిపే కృషిలో ప్రతి అడుగులో కూడా ఆదేశ స్త్రీల శక్తిని, సామర్థ్యాలను వాడుకున్నప్పుడే ఆదేశం ప్రగతిపథంలోకి నడుస్తోంది అని" మహాత్మాగాంధీ" విశ్వసించారు. మహాత్ముడు చేసిన ప్రతి ఉపన్యాసంలోనూ స్త్రీల అభివృద్ధి మరియు సమానత్వాన్ని కాంక్షించారు. 1907 సంవత్సరంలోనే దక్షిణాఫ్రికాలో మహిళలు బాలికల విద్యాభ్యాసం కోసం వాదన వినిపించారు. వారి ఉపన్యాసాల ద్వారా స్త్రీలలో అవగాహన ఏర్పడి వారు సహాయనిరాకరణ, విదేశీ వస్తువుల బహిష్కరణలో పాల్గొని బ్రిటిషు వారిని కలవరపెట్టి తీవ్ర ఆందోళనకు గురిచేసింది.

భారతీయ పురుషులు తమ స్త్రీలను అధమస్థానంలోకి నెట్టి వారిని వెనుకబడేలా చేశారని, ఇలా జరిగితే మనకు స్వాతంత్ర్యం వచ్చినా నా దేశం అభివృద్ధి చెందదు అని గాంధీజీ తమ ప్రసంగాల ద్వారా ప్రజలకు తెలియజేశారు. స్వాతంత్ర్యం గురించి మహిళలలో అవగాహనను కల్పించే బాధ్యత వారి భర్తపైన ఉందని, వారి భర్తనే వారికి మొదటి గురువు కావాలని, అప్పుడే నవసమాజం, సమసమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ మధ్యకాలంలో మలాల అనే పాకిస్తాన్ యువతి తన పోరాటంతో పాకిస్తాన్ మహిళల, విద్యాభివృద్ధికై కృషి చేసింది. ఆమె కృషికి "నోబెల్ శాంతి" బహుమతి లభించింది.

ఆనాడు మన హిందువులలో గ్రంథకర్తలు స్మృతులు, సూత్రాలు, శాస్త్రాలు హైందవ స్త్రీని అజ్ఞానిగా పరిగణిస్తూ జ్ఞానానికి దూరం చేస్తూ బాల్యవివాహంతో, వితంతువుని అనేక కట్టుబాట్లతో హీనంగా చూస్తూ స్త్రీని అథమ స్థానంలోకి నెట్టారు. 18వ శతాబ్దం నుండి ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాలలో తప్పితే గ్రామాలలో స్త్రీలు పరిస్థితి అంతంత మాత్రమే అని చెప్పవచ్చు. అభివృద్ధి కూడా జరగలేదని చెప్పవచ్చు. ఒక సాంఘిక దురాచారం తగ్గితే మరొకటి మొదలవుతుంది. ఆర్థిక స్థితిగతుల కారణంగా కొంత మంది బాలబాలికలను విద్యాభ్యాసానికి పాఠశాలలకు పంపడంలేదు తల్లిదండ్రులు. మరికొన్ని గ్రామాలలో పాఠశాలలే లేనందువల్ల బాలికలు విద్యకు నోచుకోవడంలేదు. వారందరు ప్రాథమిక విద్యతోనే సరిపెట్టుకోవలసి వస్తుంది. కళాశాలలకు వెళ్ళే అవకాశం కూడా అతి కొద్ది మందిలోనే జరుగుతుంది.

ఒక బాలుడు విద్యావంతుడైతే వ్యక్తిగా వాడొక్కడే అభివృద్ధిలోకి వస్తాడు. అదే ఒక బాలిక విద్యావంతురాలైతే ఒక కుటుంబమే అభివృద్ధిలోకి వస్తుంది. అప్పుడు మొత్తం కుటుంబంలో విద్యకు ప్రాముఖ్యం వస్తుంది. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు పిల్లలను సక్రమమైన

(MIJ) 2015, Vol No 1, Jan-Dec **e-ISSN: 2454-924X; p-ISSN: 2454-8103**

మార్గంలో పెంచలేరు. ప్రతీ బిడ్డకు తల్లియే ఆదిగురువు. విద్యావంతులైన తల్లులు తమ పిల్లలను విద్యావంతుల్ని చేసి విజ్ఞానకరమైన మార్గంలో నడిపిస్తారు. కాబట్టి బాలికల విద్యావికాసానికి ప్రాముఖ్యం ఇవ్వవలసిన అవసరం ఎంతైనా వుంది. "నేటి బాలలే రేపటి పౌరులు" అన్న నానుడి ప్రకారమే" నేటి బాలికలే రేపటి పౌరులను తీర్చిదిద్దే తల్లులు. "బాలికల విద్య, భవిష్యత్తు వాళ్ల తల్లులపైనే ఆధారపడి వుంటుంది.

ఈవిషయంలో "స్వామి వివేకానంద" వారి అభిప్రాయం. "దేశ భవిష్యత్తు, ప్రగతి, ఉన్నతి దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితి మీదనో లేక రాజ్యాంగం మీదనో ఆధారపడి లేదు. దేశ భవిష్యత్తు ఆ దేశ తల్లుల పైనే ఆధార పడి ఉంటుంది".

"Countries and World future rest not on law makers but on Women". "The salvation of our country depends upon Women" అంటారు స్వామి వివేకానంద.

విద్యావంతులైన గృహిణి ఇంటిని చక్కగా సరిదిద్దుకోగలదు. తమ పిల్లలను కూడా సక్రమమైన మార్గంలో నడిపించగలదు. పిల్లలను సమర్థవంతంగా పెంచగలదు. సమాజం, దేశ కాలమాన ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని వివేకవంతంగా వ్యవహరిస్తారు. సంసారభారాన్ని భర్తతో సమంగా పంచుకున్న భార్యల మీద భర్తలకు చిన్నచూపు ఉండదు. పట్టణ ప్రాంతాలను గమనించినట్లయితే యువతి యువకుల్లో అసమానతలు కనిపించవు. గ్రామీణ ప్రాంతాలలో యువకులు అధికులుగా పరిగణించ బడుతూ పురుషులే స్త్రీకంటే గొప్పవారనే అభిప్రాయంలో ఉండి స్త్రీలను సమానదృష్టితో చూడరు. వారిని అధమ జాతి మనుష్యులుగా చూస్తారు. స్త్రీలు కూడా తమను .తాము వారు అధములుగానే భావించు కుంటారు. వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం ఉండదు. ఆత్మవిశ్వాసాన్ని సాధించాలంటే అది కేవలం విద్యతోనే సాధ్యపడుతుంది. వారు పోగొట్టుకున్న నమ్మకం, విశ్వాసం పొందాలంటే విద్య ఒక్కటే సాధనం.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన TIME Magazine వారు ఒక సర్వే నిర్వహించింది. స్త్రీ పురుషుల బాధ్యతలను గూర్చి పరిశోధన చేసారు. స్త్రీ పురుషులను ఎంచుకొని వారికి కొంత డబ్బును ముట్టజెప్పారు. అంటే ఒక కుటుంబంలో భర్తకు, మరొక కుటుంబంలో భార్యకు డబ్బును ముట్టజెప్పారు. ఇలా కొన్ని రోజులు వారిని పరిశీలిస్తూ అనేక విషయాలను నమోదు చేయడం జరిగింది. ఎవరెవరు తమ అవసరాలకు ఎంతెంత ఖర్చు చేస్తున్నారో పరిశీలించడం జరిగింది. కొన్ని నెలలు గడిచిన తర్వాత పరిశోధన వివరాలు వెల్లడించడం జరిగింది.

ఎక్కువ మంది మగవారి కుటుంబాలు వారికిచ్చిన డబ్బును సద్వినియోగం చేయలేదు. తమ కుటుంబాలకు కూడా ఇవ్వకుండా త్రాగుడుకు ఖర్చుచేసారు. కొంతమంది జూదంలో ఓడారు. మరికొంతమంది లాటరీ టిక్కెట్లు కొన్నారు. వారి వారి కుటుంబ అవసరాలు తీరలేదు. స్త్రీలకిచ్చిన డబ్బుమాత్రం వృథా చేయకుండా 100% కుటుంబంలోని

(MIJ) 2015, Vol No 1, Jan-Dec **e-ISSN: 2454-924X; p-ISSN: 2454-8103**

వ్యక్తులకు వారిపిల్లలపై ఖర్చు చేసారు. పిల్లల పుస్తకాలు, ఇంటికి సరుకులు, మొదలగు వాటి కొరకు ఉపయోగించారు కాబట్టి స్త్రీలు మొదటగా కుటుంబానికి మరియు సంతానానికి ప్రాధాన్యతనిచ్చారు. స్త్రీ పురుషుల సర్వే గురించి చాలామంది వ్యాఖ్యానించారు. వాల్ స్ట్రీట్ జర్నల్ (Wall Street Journal) లో వ్యాసం రాసే "కాలమిస్ట్ ఆడవారు" ఏవని అయినమగవారికంటే మిన్నగా చేయగలరు" అని ("Women do almost everything better than men") పత్రికలో రాశారు.

## ముగింపు :

సంఖ్యాపరంగా స్త్రీలు సమాజంలో సగభాగమైనప్పటికీ సంపూర్ణ అక్షరాస్యతను సాధించ లేకపోయారు. స్త్రీ సమానత్వ విషయంలో నిన్నటికి ప్రముఖ బాలీవుడ్ నడుటు "అమితాబచ్చన్" తమ ఆస్తులు కొడుకుకి, కూతురికి సమానంగా ప్రకటించారు. ఈ విషయంలో అందరూ ముందంజ వేయవలసిన అవసరం వుంది. మన దేశ ప్రధానమంత్రి "బేటీ బచావో బేటీ పడావో" అనే నినాదంతో స్త్రీలందరిని చైతన్యపరుస్తున్నారు.

మహిళలందరు విద్యనే ఆయుధంగా ధరించి భారతదేశంలోని నిరక్షరాస్యతను పారద్రోల డానికి ప్రయత్నం చేయాల్సి వుంది. ఆ ప్రయత్నంలోనే దేశభవిష్యత్తు, కుటుంబ భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు ఆధారపడి వుంది.

ఆధార గ్రంథాలు (References):

1. నళిని, స్ర్తీవాద సాహిత్యం – ఒక పరిశీలన, ఫిబ్రవరి, 2010
   (Dr. Nalini, Sthrivaada Saahityam - Oka Parisheelana. February 2010)
2. వాసంతి, పి. తెలంగాణ సాంఘిక సంస్కరణ ఉద్యమాలు – మహిళల పాత్ర, 2004.
   (Vaasanthi.P, Telangana Saangika Samskarana Vudyamaalu- Mahilala paatra, 2004.)